నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 1 మార్చి 2025 | BHADRADRI KOTHAGUDEM

తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు బీఆరెస్సే

- గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేసి తప్పు చేశాం
- బీఆర్ఎస్‌లో చేరికల సభలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు

గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేట/ అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 28: గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశామని పలువురు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు బీఆర్ఎస్ పార్టీనేనని స్పష్టం చేశారు. ప్రజాపాలన అంటూ వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్ తెలంగాణ పాలనలో పూర్తిగా విఫలమైందని అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని గాండ్లగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన 15 కుటుంబాల వారు అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మెచ్చా మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో అవినీతి తప్ప.. ఎక్కడా ప్రజాభివృద్ధి కనిపించడం లేదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, చిట్లూరి ఫణీంద్ర, మందపాటి రాజ మోహన్‌రెడ్డి, సత్యవరపు సంపూర్ణ, చందా లక్ష్మీనర్సు, మిండా పెద దుర్గారావు, జక్కుల రాంబాబు, చిన్నబ్బాయి, నాని బాబు, మనోహర్, బజారయ్య, శ్రీను, రాంబాబు, గంధం ఆనంద్, తగరం హరి, ఉప్పల మురళి, గాలి రాంబాబు, నాగేశ్వరరావు, చిలకా రావు, రమేశ్, సత్యనారాయణ, అశ్వనీకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలో పర్యటించిన మెచ్చా నాగేశ్వర రావు.. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

కాంగ్రెస్ పాలనలో సర్కార్ ఉద్యోగులు కొందరు బరితెగిస్తున్నారు. చేయి తడిపితేనే పనులు చేస్తున్నారు. అన్ని శాఖల్లోనూ అవినీతి మరకలు కనిపిస్తున్నాయి. ఒకరు కాదు.. ఇద్దరు కాదు ఏకంగా 14 నెలల్లో 15 మంది అధికారులు ఏసీబీకి చిక్కి సర్కార్ పరువు తీసేశారు. పెద్దసార్లు పట్టించుకోకపోవడంతో కిందిసార్లు ఆడిందే ఆట.. పాడిందే పాటగా అందినకాడికి దండుకుంటున్నారు. పిల్లి కళ్లు మూసుకుంటే ఎలుక తోక ఆడించినట్లుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అవినీతి ఉద్యోగులు పెచ్చుమీరిపోతున్నారు.. తగ్గేదేలే అంటూ లంచాలకు పాల్పడుతున్నారు. అయితే అదేస్థాయిలో వదిలేదేలే అంటూ ఏసీబీ అధికారులు వరుస దాడులు చేసి అవినీతి ఉద్యోగుల భరతం పడతున్నారు. అయినప్పటికీ లంచావతారులు భయపడేదేలే అంటూ పేట్రేగిపోతున్నారు. ఏదేమైనా కాంగ్రెస్ సర్కార్‌లో పాలన గాడి తప్పిందని ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పిన 'ప్రజాపాలన' ఇదేనా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. –భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ)

అశ్వాపురంలో ఏవో (ఫైల్)

ఇల్లెందులో మైనార్టీ స్కూల్ హెచ్ఎం కృష్ణ (ఫైల్)

ఏసీబీకి చిక్కిన ఆళ్లపల్లి ఎంపీవో శ్రీనివాస్, మర్కోడు సెక్రటరీ నాగరాజు (ఫైల్)

- బరితెగించి లంచాలకు పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగులు
- లంచావతారుల భరతం పడుతున్న ఏసీబీ టీం
- కాంగ్రెస్ సర్కారులో భరించలేని అవినీతి కంపు
- 'భద్రాద్రి'లో 14 నెలల్లో 15 మంది రిమాండ్
- 'ఇదేనా ప్రజాపాలన?' అంటూ ముక్కున వేలేసుకుంటున్న ప్రజలు

తగ్గేదేలే! వదిలేదేలే!!

కాంగ్రెస్ పాలన వచ్చిందంటే ఎవరికైనా అలుసే. ఎలాంటి అవినీతి పనులైనా ఎంచక్కా లైన్ క్లియర్ అవ్వాల్సిందే. కాంగ్రెస్ ప్రభుత్వంలో పైరవీలకు పెద్దపీట వేసినట్టే అని సర్వత్రా తెలియని వారుండరు. అదే క్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు సైతం ఫ్రీహ్యాండ్ వచ్చినట్లే అని సంబురపడుతున్నారు. దీంతో అవినీతి మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతున్నది. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో అధికారులు, ఉద్యోగులు లంచాలకు పాల్పడుతున్నారు. కనీసం కలెక్టరేట్ అనే భయం కూడా లేకుండా ఐడీవోసీలోనే ఓ హార్టికల్చల్ అధికారి ఏకంగా రూ.లక్షకు పైగా లంచం తీసుకుని మరీ ఏసీబీకి చిక్కారు. ఏడాదిలోపే 15 మంది ఉద్యోగులు ఏసీబీ ట్రాప్‌లో పడి ఊచలు లెక్కిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నా అధికారులకు ఎలాంటి భయం లేదంటే కాంగ్రెస్ పాలనకు ఇంతకన్నా ఉదాహరణ ఏమీ చెప్పనక్కర్లేదు.

ఏసీబీకి పట్టుబడిన 15 మంది..

లంచాలకు మరిగిన ఉద్యోగులు పోటీపడి మరీ ఏసీబీకి చిక్కుతున్నారు. ఏడాదిలోపే 15 మంది అడ్డంగా దొరికిపోయారు. అటు కాంగ్రెస్ పాలనలో ప్రజాప్రతినిధులు తలోదారిగా ఉంటే.. ఇటు ఉద్యోగులు ఇష్టానుసారంగా లంచాలకు మరిగి బరితెగిస్తున్నారు. ఉద్యోగులకు జీతాలు వచ్చినా సరిపోక లంచాలకు తెగబడుతున్నారు. ఎన్నిసార్లు ఏసీబీ అధికారులు దాడి చేసినా కనీసం చీమ కుట్టినట్లుగా లేకపోవడం విశేషం.

లంచావతారులు వీరే..

01. భద్రాచలం టౌన్ ఎస్ఐ శ్రీనివాస్
02. పాల్వంచ మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్
03. అశ్వారావుపేటలో విద్యుత్ శాఖ ఏఈ
04. చర్ల మండలంలో డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబు
05. ఆళ్లపల్లి మండలంలో ఎంపీవో, సెక్రటరీ
06. పాల్వంచ పట్టణంలో ఎస్ఐ రాము
07. పాల్వంచలో విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు
08. కొత్తగూడెం ఐడీవోసీలో జిల్లా హార్టికల్చల్ అధికారి సూర్యనారాయణ
09. పాల్వంచలోని మెడికల్ కాలేజీలో ఏవో, జూనియర్ అసిస్టెంట్
10. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పంచాయతీ సెక్రటరీ
11. దమ్మపేట మండలంలో అసిస్టెంట్ సర్వేయర్ మెరుగు వెంకటరత్నం
12. ఇల్లెందులోని మైనార్టీ గురుకుల పాఠశాల హెచ్ఎం కృష్ణ
13. అశ్వాపురం మండలంలో ఏవో శాంతన్‌కుమార్
14. ఇల్లెందులో ఫారెస్టు రేంజ్ అధికారి ఉదయ్‌కిరణ్, బీట్ ఆఫీసర్
15. కొత్తగూడెం కూలీలైన్ ప్రభుత్వ స్కూల్ హెచ్ఎం తాటి రవీందర్

ఉద్యోగులను పీడిస్తున్న సర్కారు?

ఉద్యోగులను కాంగ్రెస్ సర్కారు పీడిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులకు రావాల్సిన డీఏలు, టీఏలు, పీఎఫ్‌లు కాక బోలెడు సొమ్ములు పెండింగ్‌లో ఉండడంతో వారు ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. ఈ పరిస్థితిలోనే ఉద్యోగులు అవినీతికి అలవాటు పడుతున్నారా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన హెచ్ఎం

కొత్తగూడెంలో పట్టుబడిన హెచ్ఎం తాటి రవీందర్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఫిబ్రవరి 28: బిల్లు చెల్లింపు విషయంలో పాఠశాల హెచ్ఎం రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో ఓ కరాటే మాస్టర్ విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్నాడు. ఈ క్రమంలో అతడికి సంబంధించి రూ.30 బిల్లు ప్రభుత్వం నుంచి మంజూరైంది. ఆ బిల్లును సదరు కరాటే మాస్టర్‌కు చెల్లించకుండా పాఠశాల హెచ్ఎం తాటి రవీందర్ ఇబ్బందులకు గురిచేయడంతోపాటు రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. దీనికి ఒప్పుకున్న కరాటే మాస్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు పన్నిన పథకం ప్రకారం.. పాఠశాలలో హెచ్ఎం రవీందర్ కరాటే మాస్టర్ నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హెచ్ఎం రవీందర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు.

అవినీతి జాడ్యం పోవాలి..

కొన్ని ఘటనలు చాలా దారుణంగా ఉంటున్నాయి. వచ్చేది ముప్పై వేలు అయితే అందులో రూ.20 వేలు లంచం అడిగారు. మొదటి నుంచీ ఉన్న అలవాటు మీద కొంతమంది లంచాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఈ అవినీతి జాడ్యం పోవాలి. బాధితులు ధైర్యం చేసి ఏసీబీ అధికారులను సంప్రదించాలి. ఫోన్‌లో లంచం అడిగినా తప్పే. కాల్ రికార్డును పరిశీలిస్తాం. ఏ ప్రభుత్వ ఉద్యోగి ఇబ్బంది పెట్టినా 9154388981 నెంబర్‌కు కాల్ చేసి చెప్పండి. బాధితుల పేర్లు గోప్యంగా ఉంచుతాం.
– రమేశ్, ఏసీబీ డీఎస్పీ, ఖమ్మం

అవినీతి నిరోధక శాఖ కార్యాలయం
OFFICE OF ANTI-CORRUPTION BUREAU KHAMMAM

బీమా చెక్కును అందిస్తున్న ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

శ్రేణులకు అండగా బీఆర్ఎస్

పార్టీ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు పంపిణీలో లింగాల కమల్‌రాజు

ముదిగొండ, ఫిబ్రవరి 28: బీఆర్ఎస్ శ్రేణులకు తమ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు పేర్కొన్నారు. కార్యకర్తల కష్టసుఖాల్లో తోడు నీడగా నిలుస్తుందని అన్నారు. అందుకోసమే కార్యకర్తలకు రక్షణ కవచంలా బీమా సౌకర్యాన్ని కల్పించిందని అన్నారు. ముదిగొండలో మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పార్టీ కార్యకర్తలకు మంజూరైన బీమా చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కమల్‌రాజు మాట్లాడుతూ.. ముదిగొండ మండలంలోని వనంవారి కిష్టాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త షేక్ మీరా సాహెబ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు చెప్పారు. అప్పటికే పార్టీ సభ్యత్వం కలిగి ఉన్న మీరా సాహెబ్‌కు పార్టీ ప్రమాదబీమా కింద రూ.2 లక్షల బీమా పరిహారం మంజూరైనట్లు చెప్పారు. కాగా, ఈ మొత్తాన్ని మృతుడి నివాసంలో అతడి కుటుంబసభ్యులకు అందజేశారు. అనంతరం మేడేపల్లిలో మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్‌ను పరామర్శించారు. హరిప్రసాద్ సతీమణి ఇటీవల మరణించినందున శుక్రవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, గడ్డం వెంకటి, మందరపు ఎర్ర వెంకన్న, సిల్వరాజు, ఉపేందర్, శ్రీను, తోట ధర్మారావు, పోట్ల ప్రసాద్, పణితి నర్సింహారావు, నాగయ్య, బత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టండి

మణుగూరు పాఠశాలల తనిఖీలో భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 28: తెలుగు, ఇంగ్లిష్ చదవడం, రాయడంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో రాహుల్ ఉపాధ్యాయులకు సూచించారు. గుట్ట మల్లారం జీపీఎస్, పగిడేరులోని జీపీఎస్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల చేత బోర్డుపై అక్షరమాల, అధికారుల పేర్లు రాయించారు. పిల్లలు రాయడం, చదవడంలో వెనుకబడి ఉన్నారని, బాలశిక్షలోని పాఠ్యాంశాలను చదవడంలో కొందరు పిల్లలు వెనుకబడి ఉన్నారని, పిల్లలందరూ తప్పులు లేకుండా రాసేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గిరిజన చిన్నారులకు విద్యను బలోపేతం చేయడానికి ఎన్నో సంస్కరణలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏటీడీవో అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణతో ఉపాధి అవకాశాలు: భద్రాద్రి కలెక్టర్

ధ్రువపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

పాల్వంచ, ఫిబ్రవరి 28 : వృత్తి నైపుణ్య శిక్షణతో వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని, నిరుద్యోగ యువత శిక్షణలో మెళకువలు నేర్చుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం పాల్వంచలోని నవ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ పూర్తి చేసుకున్న ఐటీఐ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసే కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిక్షణ కేంద్రంలోని తరగతి గదులను పరిశీలించి శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. శిక్షణ ఎలా ఉంది? ఏయే కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు? అన్ని అంశాలపై అవగాహన పెంచుకున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది శిక్షణ పొందారు? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వృత్తి నైపుణ్య విద్యలో శిక్షణ పొందిన అభ్యర్థులు స్వయం ఉపాధి పొందుతూ పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పదో తరగతి తర్వాత ఐదేళ్లపాటు విద్యను కొనసాగించేందుకు ఆర్థిక వనరులు ఉండకపోవచ్చని, అలాంటి వారు వృత్తి నైపుణ్య శిక్షణ పొంది ఉపాధి అవకాశాలను పొందవచ్చన్నారు. సీపీవీవో సంజీవరావు, నవ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్, శిక్షణ కేంద్రం ఉపాధ్యాయులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

'ఎస్ఎల్‌బీసీ' సహాయక చర్యల్లో 'సింగరేణి'

స్వయంగా వెళ్లి పరిశీలించిన సీఎండీ బలరాం

ఎస్ఎల్‌బీసీ టన్నెలో చిక్కుకున్న ఎనిమిది మంది ఆచూకీ తెలుసుకునేందుకు సింగరేణి రెస్క్యూ బృందం రంగంలోకి దిగింది. రెస్క్యూ బృందం సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకు సింగరేణి సీఎండీ బలరాం సైతం ఘటనా ప్రాంతానికి వెళ్లారు. సొరంగంలోకి రెస్క్యూ బృందం సభ్యులతో కలిసి వెళ్లి సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. 24 గంటలపాటు బృందంతోనే ఉంటూ వారిలో ధైర్యం నింపుతున్నారు. మరో 200 మంది సింగరేణి రెస్క్యూ బృందం సభ్యుల రాకతో సహాయక చర్యలు మరింత ముమ్మరం చేయనున్నారు. సీఎండీ రెస్క్యూ బృందానికి నాయకత్వం వహించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. –కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 28

మహిళా సాధికారతకు చర్యలు

- స్త్రీల జీవితాల్లో మార్పు దిశగా అడుగులు
- జాతికి, ఇంటికి ఆణిముత్యం ఆడపిల్ల

జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, ఫిబ్రవరి 28: మహిళల జీవితాల్లో మార్పు దిశగా ఖమ్మం జిల్లాలో అడుగులు పడ్డాయని, భవిష్యత్తులో మహిళా అభివృద్ధికి మరింత మెరుగ్గా పని చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మహిళా సమాఖ్య సభ్యులకు సూచించారు. స్థానిక టేకులపల్లిలో శుక్రవారం నిర్వహించిన గౌతమి జిల్లా మహిళా సమాఖ్య సాధారణ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి యూనిట్లు, మహిళ డెయిరీ, మహిళా మార్టు ఏర్పాటు ద్వారా జిల్లాలో మహిళా సాధికారతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ కోసం నిర్దేశించిన సమయంలో వైద్యులు తప్పకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎవరైనా ఆడపిల్ల అని అబార్షన్ చేయించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు వైద్యుల దృష్టికి వస్తే వెంటనే తమకు సమాచారాన్ని అందజేయాలన్నారు. ఆడపిల్ల.. ఇంటికి, సమాజానికి, జాతికి విలువైన ఆణిముత్యమని, ఆడపిల్లల సంఖ్య పెంచాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. మహిళా సమాఖ్యలో ఉన్న సభ్యుల్లో ఎవరి ఇంట్లోనైనా ఆడపిల్ల పుడితే తనను పిలవాలని, సంతోషంతో వచ్చి ఆ చిన్నారిని ఆశీర్వదిస్తానని పేర్కొన్నారు. డీసీపీవో విష్ణువందన, డీఎంసీ డీహెచ్ఈడబ్ల్యూ సర్మీన్‌లు 'బేటీ బచావో – బేటీ పడావో' కార్యక్రమం కింద చేపట్టే పనులను వివరించారు. సీజన్ వ్యాధుల పట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ ఎడ్యుకేటర్ అన్వర్ అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ 'బేటీ బచావో – బేటీ పడావో' పోస్టర్లను ఆవిష్కరించారు. డీఆర్డీవో సన్యాసయ్య, అదనపు డీఆర్డీవో నూరొద్దీన్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, సంబంధిత శాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

ఖమ్మం కలెక్టర్‌ను సన్మానిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

చదువు, ఆటల్లో రాణించాలి

- ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి పోలీసు శాఖ కృషి
- వాలీబాల్ టోర్నీ ప్రారంభోత్సవంలో భద్రాద్రి ఎస్పీ

టోర్నీలో 54 జట్లు

వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 28: ఏజెన్సీ ప్రాంతంలోని యువత చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని, అప్పుడే సరైన గుర్తింపు లభిస్తుందని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. ములకపాడు క్రీడా మైదానంలో దుమ్ముగూడెం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహించనున్న మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎస్పీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత చిన్నతనం నుంచే కష్టపడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఏజెన్సీ యువత కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూ.2 కోట్ల వ్యయంతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే ప్రారంభించనున్నట్లు చెప్పారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధి కోసం పోలీసు శాఖ ఎంతో కృషి చేస్తున్నదని, ఇటీవల జరిగిన అండర్–19 మహిళల క్రికెట్ వరల్డ్ కప్ పోటీల్లో జిల్లాకు చెందిన గొంగిడి త్రిష అత్యంత ప్రతిభ కనబరిచారని గుర్తుచేశారు. కాగా, వాలీబాల్ టోర్నీలో 54 జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. ఏఎస్పీ పరితోశ్ పంకజ్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, 141 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రేవతి అర్జునన్, సీఐ అశోక్, ఎస్సైలు వెంకటప్పయ్య, గణేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలి
- కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

'భద్రాద్రి'లో 36 కేంద్రాలు ఏర్పాటు చేశాం: కలెక్టర్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఫిబ్రవరి 28: ఇంటర్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి అన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్ఎస్‌పై కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి శుక్రవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఐడీవోసీ నుంచి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ మార్చి 5వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సిబ్బంది నియామకం, శిక్షణ పూర్తి కావడంతోపాటు ప్రశ్నపత్రాలు జిల్లాలకు చేరుకున్నాయన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 36 కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొదటి సంవత్సరంలో 9,255 మంది, ద్వితీయ సంవత్సరంలో 10,003 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రామచంద్ర డిగ్రీ కాలేజీలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. 36 మంది చీఫ్ సూపరింటెండెంట్లతోపాటు 13 మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, 36 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 13 మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్డీవోలు మధు, దామోదర్‌రావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, డీపీవో చంద్రమౌళి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మహేందర్, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో వీసీలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, అధికారులు